మారిన దరఖాస్తు నమోదు ప్రక్రియ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు నమోదు ప్రక్రియలో ప్రభుత్వం మార్పులు చేసిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు పొందేందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల విద్యార్థులు నమోదు ప్రక్రియను మూడు దశల్లో పూర్తి చేయాలని ఆయన తెలిపారు. డెమో అథెంటికేషన్, బయో మెట్రిక్ అథెంటికేషన్, కంప్లీట్ రిజిస్ట్రేషన్ మీసేవలో పూర్తి చేసిన అనంతరం దరఖాస్తును కళాశాలల్లో అందజేయాలని ఆయన తెలిపారు.

కాయకల్ప, ఎన్‌ఖ్వాస్ పురస్కారాలు


కాయకల్ప, ఎన్‌ఖ్వాస్ పురస్కారాలు సాధించిన చౌటుప్పల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, వైద్యాధికారులు, సిబ్బంది

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ బంగారుగడ్డలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప, ఎన్‌ఖ్వాస్ పురస్కారాలకు ఎంపికైంది. నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో తనిఖీలు నిర్వహించి ర్యాంకులు కేటాయించారు. అత్యవసర సేవలు, సాధారణ పరిపాలన, ఐపీడీ, ఓపీడీ, ప్రయోగశాల, ఫార్మసీల విభాగంలో 93.56 శాతం, లేబర్ రూమ్ విభాగంలో 98 శాతం, మెటర్నిటీ ఓటీలో 94 శాతం స్కోరు సాధించినట్టు వెల్లడించారు. కాయకల్ప పురస్కారం లభించినందుకు స్థానిక ఆరోగ్య కేంద్రం ఎదుట సూపరింటెండెంట్, వైద్యాధికారులు, సిబ్బంది గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డా.అలివేలు మాట్లాడుతూ, వైద్యాధికారులు, సిబ్బంది కృషి ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో రెండో పర్యాయం కాయకల్ప పురస్కారం సాధించామని తెలిపారు.

పల్లె ఓటర్ల లెక్క తేలింది


మిర్యాలగూడలో పంచాయతీలో తుది ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శేషగిరి శర్మ(పాత చిత్రం)

మిర్యాలగూడ పట్టణం, భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవలే ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 71 మండలాలకు 1,768 గ్రామ పంచాయతీలు, 15,478 వార్డులు ఉన్నాయి. మొత్తం 22,45,868 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 11,11,488 మంది, మహిళలు 11,34,305 మంది, థర్డ్ జెండర్ 75 మంది ఉన్నారు.

రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికం..

ఉమ్మడి జిల్లాలోని నల్గొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 10,42,545 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 5,25,780 మంది, పురుషులు 5,16,713 మంది, థర్డ్ జెండర్ 52 మంది ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 6,82,882 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో మహిళలు 3,47,320 మంది, పురుషులు 3,35,542 మంది, థర్డ్ జెండర్ 20 మంది ఉన్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 5,20,441 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 2,61,205 మంది, పురుషులు 2,59,233 మంది, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు.

మూడు జిల్లాల్లో మహిళలే అత్యధికం..

ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని గ్రామీణ ఓటర్లలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే మహిళలు 22,817 మంది అధికంగా ఉండగా.. సూర్యాపేట జిల్లాలో 11,778 మంది, నల్గొండ జిల్లాలో 9,067 మంది, యాదాద్రి జిల్లాలో 1,972 మంది మహిళలు అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ఓటర్ల వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
నల్గొండ	31	856	7,392	5,16,713	5,25,780	52
సూర్యాపేట	23	486	4,388	3,35,542	3,47,320	20
యాదాద్రి	17	426	3,698	2,59,233	2,61,205	3

యాదాద్రిలో దేవీ ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం ఆలయ ఆచార, వ్యవహారాలతో సంప్రదాయ క్రతువులు నిర్వహించారు. అఖండ దీపారాధన, మండప ఆరాధన, కలశ స్థాపన, శ్రీ దేవీ మూల మంత్ర జపం, లలితా పారాయణం, సహస్రనామార్చన పర్వాలు నిర్వహించారు. కైంకర్యాలలో యాదాద్రి ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు. శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో నిత్యారాధనలు కొనసాగించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఆది పూజలో ఆలయ నిర్వాహకులకు రక్షాబంధనం చేశారు. రాత్రి వేళ అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు.


అమ్మవారికి హారతి నివేదన

స్వయంభూ క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో గురువారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ ఆస్థాన, ఆర్జిత పూజలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. సుప్రభాతం నిర్వహించిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి, నారసింహ అర్చామూర్తులను హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీపత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీ సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణమూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని చేపట్టారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాలు, మంత్ర పఠనంతో చేపట్టారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయం వెల్లడించారు. వివిధ విభాగాల నుంచి రూ.10,41,486 చేకూరింది.

దీన్ని రోడ్డే అంటారా!



యాదగిరిగుట్ట నుంచి పాతగుట్టకు వెళ్లే దారిని చూస్తే 'దీన్ని రోడ్డే అంటారా' అనే వాహనదారులకు ఆగ్రహం కలిగించకమానదు. అడుగడుగున గుంతలు, పారే మురుగు, మూత లేని కుళాయి నీళ్లతో అసౌకర్యకరంగా మారింది. యాదగిరిగుట్ట అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఇదే దారిలో ఉంది. వచ్చే భక్తులు ఈ దారిని చూసి మండిపడుతున్నారు. అరుదుగా ఉండే జట్కా ప్రయాణం చేయాలనుకునే వారి ఈ గుంతలపై ప్రయాణం ఇబ్బంది పెడుతోంది. అశ్వాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. పాలకులు స్పందించి వెంటనే ఈ దారి మరమ్మతులు చేయించాలని స్థానికులతో పాటు భక్తులు కోరుతున్నారు. పుర అధ్యక్షురాలు సుధను వివరణ కోరగా రూ.3 కోట్లతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదన జరిగిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట పట్టణం

ఇదే ఆఖరి గడువు



రాజపేట, ఆలేరు, న్యూస్‌టుడే:

ప్రభుత్వం ఎంత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒకచోట క్వింటాళ్ల కొద్ది పీడీఎస్ బియ్యం పోలీసులకు పట్టుబడుతోంది. ఈ అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు, అర్హులకే బియ్యం అందేలా చూసేందుకు ప్రభుత్వం రేషన్ కార్డులకు 'ఈ కేవైసీ' (ఎలక్ట్రానిక్- నో యువర్ కస్టమర్)ని తప్పనిసరి చేసింది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకే రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటోంది. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారు ఈ కేవైసీ చేయించుకోకుంటే వారి పేర్లను కార్డుల్లో నుండి తొలగించనున్నారు. ఇందుకోసం పలు దఫాలుగా పొడిగించిన గడువును ప్రభుత్వం తాజాగా మళ్లీ పొడిగించింది. నెలాఖరుతో ముగియనున్న తేదీని డిసెంబరు 31 వరకు పెంచింది. మరోసారి ఈ అవకాశం ఉండబోదని, నిర్లక్ష్యం చేసిన లబ్ధిదారులు ఆ తర్వాత రేషన్ పొందలేరని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

80శాతం కూడా దాటని ప్రక్రియ..

ఈ కేవైసీ నమోదు ప్రక్రియ కార్యక్రమం గత భారాస ప్రభుత్వ హయాంలో మొదలైంది. నల్గొండ జిల్లాలో 3,68,041 మంది, సూర్యాపేట జిల్లాలో 2,50,916 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,78,926 మంది ఇంకా ఈ కేవైసీకి నోచుకోలేదు. ఏ ఒక్క జిల్లాలోనూ ఈ కేవైసీ 80 శాతం పూర్తి కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంకా 7,97,883 మంది లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. లబ్ధిదారులు ఈ సారి నిర్లక్ష్యం చేస్తే ప్రయోజనం కోల్పోయే అవకాశం ఉంది. తస్మాత్ జాగ్రత్త..

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	రేషన్‌కార్డులు	లబ్ధిదారుల సంఖ్య	ఈ కేవైసీ చేసుకున్నవారు	శాతం
నల్గొండ	4,66,181	13,94,172	10,26,131	73
సూర్యాపేట	3,24,222	9,32,444	6,81,528	73
యాదాద్రి	2,16,848	6,60,259	4,81,333	79

జాప్యానికి పలు కారణాలు..

- ఎక్కువ మందికి ఆధార్ నవీకరణ, బయో మెట్రిక్ వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.
- గత పదేళ్లలో చాలా మంది చనిపోయారు. వారి వివరాలు అప్‌డేట్ చేయకపోవడం.
- యువతులు, వివాహాలు చేసుకుని అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. కొత్త కాపురాలు పెట్టిన వారికి నూతన కార్డులు మంజూరు కాలేదు.
- లబ్ధిదారుల పేరుతో కొందరు డీలర్లు రేషన్ నిల్వలు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.
- క్షేత్రస్థాయిలో పలు సమస్యలున్నప్పటికీ కొత్తకార్డులు లేకున్నా రేషన్ బియ్యం పంపిణీ ఆహారభద్రత కార్డుల ఆధారంగా యధావిధిగా కొనసాగుతుంది.

నేడు 'ప్రపంచ చిరునవ్వు దినోత్సవం'



కాస్త నవ్వండి.. బాస్..!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

నవ్వు నాలుగు విధాలా చేటు.. అనేది పాత సామెత.. నవ్వు నలభై విధాల మేటి అనేది నేటి సామెత. నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వకపోవడం ఒక రోగం.. అన్నాడో సినీ కవి. ఎలాంటి సమస్యనైనా చిన్న చిరునవ్వుతో దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు. ఇలాంటి నవ్వు పట్ల నేటి తరానికి అవగాహన లేకపోవడంతో నిరంతరం ఘర్షణలు, తగాదాలతో కాలం గడుపుతున్నారు. మరో వైపు సమాజంలో భావి భారత పౌరులను తీర్చి దిద్దే ఉపాధ్యాయులు, శాంతి భద్రతలను పరిరక్షించే పోలీసులు నవ్వుతో తమ సేవలు అందించడం వల్ల మెరుగైన ఫలితాలు పొందొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నవ్వు గొప్పతనాన్ని వివరించేందుకు ఏటా అక్టోబరు మొదటి శుక్రవారం 'ప్రపంచ చిరునవ్వు దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

చిరునవ్వు వల్ల కలిగే ప్రయోజనాలు ఇవీ..


- గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- రక్తపోటు తగ్గుతుంది.
- సహజ నొప్పి నివారిణిగా ఉపకరిస్తుంది.
- ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతుంది
- స్నేహబంధం బలపడుతుంది.
- ఒత్తిడిని తగ్గిస్తుంది.
- మానసిక స్థితిని మెరుగు పరుస్తుంది.
- యవ్వనంగా, ఆకర్షణీయంగా కనిపించేందుకు తోడ్పడుతుంది.
- ఇతరులలో నమ్మకాన్ని కలిగిస్తుంది.

చిన్న చిరునవ్వుతో అనేక సమస్యలు దూరం..

ఏదైనా సమస్యతో వచ్చిన వారిని చిన్న చిరునవ్వుతో పలకరిస్తే కొండంత అండ దొరికినట్లు భావిస్తారు.
ఉమ్మడి జిల్లాలో 3,209 పాఠశాలలు ఉండగా..
వీటిలో 2,11,009 మంది విద్యార్థులు ఉన్నారు.
వీరిలో అనేక మంది విద్యార్థులు ఒకటి, రెండు సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటున్నారు. మరి కొంత మంది నలుగురిలో కలిసేందుకు ఇబ్బంది పడుతుంటారు. అయితే ఆయా తరగతుల ఉపాధ్యాయులు చిరునవ్వుతో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగితే వారి సమస్యలు దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు. కోపంతో కాకుండా చిరునవ్వుతో విద్యార్థులకు పాఠాలు బోధించడం వల్ల అవి త్వరగా వారి మెదడులో నిక్షిప్తం అవుతాయని నిపుణులు చెబుతున్నారు.



పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఉన్న ఉమ్మడి జిల్లా యువత..



శాంతి చిరునవ్వుతోనే ప్రారంభమవుతుంది: మదర్ థెరిసా



ఉపయోగాలు ఇలా..

డాక్టర్ భవాని, మానసిక వైద్య నిపుణురాలు, మిర్యాలగూడ



అనుక్షణం నవ్వుతూ ఉండటం వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలై సంతోషాన్ని అందించడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. నవ్వుతూ ఉండే వారికే ఎక్కువ మంది స్నేహితులు ఉంటారు. తరచూ చిరునవ్వుతో ఉండటం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు గుండె జబ్బులు నియంత్రణలో ఉండటం, రోగ నిరోధక శక్తి వృద్ధి చెందడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి.

కాఠిన్యాన్ని దూరం చేయాలి..



పోలీసులంటే సాధారణ పౌరులకు సైతం ఒక రకమైన భయం కలుగుతుంది. దీనిని నివారించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ అమలులో మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పోలీసులతో తమ సమస్యను మనస్ఫూర్తిగా చెప్పే అవకాశం ప్రజలకు దక్కడం లేదు. దీన్ని నివారించేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులు చిరునవ్వుతో పలకరిస్తే వారి సమస్యలు వివరంగా చెప్పగలిగే వాతావరణం ఏర్పడుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక మంది ఉమ్మడి జిల్లా యువత పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరంతా తమ విధులను చిరునవ్వుతో నిర్వర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొనసాగుతున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన


వివరాలను కలెక్టర్ హన్మంత్ కె.జెండగేకు వివరిస్తున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం కలెక్టర్ హన్మంత్ కె.జెండగే పరిశీలించారు. ప్రక్రియ వివరాలను డీఈవో సత్యనారాయణ ఆయనకు వివరించారు. పరిశీలన కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. గడువులోపు అభ్యర్థులు పరిశీలన ప్రక్రియకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాకు 243 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యాయి. ధ్రువీకరణ ప్రక్రియకు 646 మంది హాజరు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 353 మంది అభ్యర్థులు ప్రక్రియకు హాజరయ్యారు. ఈ నెల 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగనుంది. రెండు రోజుల వ్యవధి ఉన్నందున అభ్యర్థులు హాజరు కావాలని డీఈవో సత్యనారాయణ కోరారు.

వైద్య విద్యార్థులొస్తున్నారు


ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: యాదాద్రి ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన వైద్య విద్య కౌన్సెలింగ్‌లో 32 మంది విద్యార్థులు యాదాద్రి భువనగిరి ప్రభుత్వ కళాశాలను వెబ్‌ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకున్నారు. కళాశాల ఏర్పాటు చేసిన పగిడిపల్లి పాత కలెక్టరేట్ భవనంలో విద్యార్థులకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సీటు పొందిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవుతున్నారు. ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు పర్యవేక్షణలో రిపోర్టు ప్రక్రియ కొనసాగుతోంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన 32 మందిలో గురువారం వరకు 32 మంది రిపోర్టు చేసినట్లు కళాశాల అధికారులు తెలిపారు. ఆలిండియా స్థాయిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏడుగురు యాదాద్రి కళాశాలను ఎంచుకున్నారు. ఆరుగురు రిపోర్టు చేశారు. ప్రస్తుతం 38 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. తొలివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్ శుక్రవారం పూర్తవుతుంది. తదుపరి కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం విద్యార్థులు ఎంచుకున్న మేర సీట్లు భర్తీ కానున్నాయి.

తొలి ఏడాది 50 సీట్లతో..

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 2024-25కు జిల్లా వైద్యకళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్యమండలి 50 సీట్లకు అనుమతి ఇచ్చింది. తరగతుల నిర్వహణకు పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనం ఎంపిక చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య విద్యార్థులకు బోధనకు అనుగుణంగా ఉండే తరగతి గదులు, ప్రిన్సిపల్, కార్యాలయాల, సబ్జెక్ట్ ప్రొఫెసర్లకు ప్రత్యేక గదులుగా తీర్చిదిద్ది అందుబాటులోకి తెచ్చారు. తాత్కాలిక భవనం పాత కలెక్టరేట్‌ను ఎంపిక చేయగా పూర్తి స్థాయి వైద్యకళాశాల, ఆసుపత్రి నిర్మాణం కోసం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో ప్రభుత్వ 20 ఎకరాల స్థలం కేటాయించింది. వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్రాసుపత్రి బోధనాసుపత్రిగా అందుబాటులోకి రానుంది. 220 పడకల బోధనాసుపత్రిగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వంటకు తప్పిన తంట

◆ మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బకాయి సొమ్ము విడుదల



బొందుగుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న మహిళలకు ప్రభుత్వ పరంగా ఊరట లభించింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసింది. జూన్ నుంచి ఆగస్టు వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు రావాల్సిన మొత్తం రూ.4.84 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు భోజనం బిల్లులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న విషయం తెలిసిందే. కోడిగుడ్ల బిల్లులను రాష్ట్రమే చెల్లిస్తుంది. మధ్యాహ్నభోజనం నిర్వహించే మహిళలకు చెల్లించే గౌరవ వేతనం రూ.3 వేల గౌరవ భృతిలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.600, మిగతా రూ.2,400 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న విషయం తెలిసిందే.

నేరుగా ఖాతాల్లోనే జమ..

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 3,210 మధ్యాహ్న భోజన ఏజెన్సీలున్నాయి. వీరు పాఠశాలల్లో ప్రతిరోజూ నియమిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వంట చేసే మహిళలకు ఈ ఏడాది జూన్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ప్రతి నెలా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వాహక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందే. ముఖ్యంగా పెరుగుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలతో గిట్టుబాటు కావడం లేదని, బిల్లులు సకాలంలో రాని కారణంగా వారు అప్పులు తెచ్చి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి పరిస్థితి తెలుసుకున్న ప్రభుత్వం నిర్వాహకులకు రావాల్సిన వంట ఖర్చులతో పాటు గౌరవ వేతనం కూడా విడుదల చేసింది. మూడు నెలలకు సంబంధించి మొత్తం సొమ్మును నేరుగా సదరు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లా బిల్లుల వివరాలు..

మొత్తం పాఠశాలలు : 3,210	విద్యార్థుల సంఖ్య 2,11,009
భోజనం బిల్లు :	రూ.3,40,47,153
కోడిగుడ్ల బిల్లు :	రూ. 1,43,64,900
మూడు నెలల మొత్తం బిల్లు :	రూ.4,84,12,053

కోడిగుడ్లకు మొత్తం చెల్లింపు..

ప్రభుత్వ ఆదేశం ప్రకారం మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. వీటి బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో నిర్వాహకులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6 ఉండగా.. ప్రభుత్వం వంట చేసే మహిళలకు రూ.5 చొప్పున మాత్రమే చెల్లిస్తుండటం గమనార్హం. అది కూడా నెలనెలా చెల్లించడం లేదు. ఏజెన్సీలు పెట్టుబడులకు బయట అప్పులు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు కూడా వచ్చాయని పాఠశాల వర్గాలు అంటున్నాయి. జూన్ నుంచి గత ఆగస్టు నెల వరకు రావాల్సిన సొమ్మును ఎస్టీవో ద్వారా మహిళల ఖాతాల్లో జమ చేశారు. గత విద్యా సంవత్సరం బకాయిలు ఈ ఏడాది జూన్‌లో విడుదలైన విషయం తెలిసిందే. తాజాగా ఆగస్టు వరకు బిల్లులు చెల్లించడంతో మధ్యాహ్న వంట నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాన్నే స్ఫూర్తి..!

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక ఐఐటీ కాన్పూర్‌లో ఇంజినీరింగ్ పట్టా పొందినప్పటికీ.. సివిల్ సర్వీసెస్‌లో ఐఆర్‌ఎస్ సాధించిన నాన్న స్ఫూర్తితో కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే 70వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించారు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి. 2022 బ్యాచ్‌కు చెందిన ఆయన వికారాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా శిక్షణ పొంది.. ఇటీవలే మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో పలు విషయాలను పంచుకున్నారు.

పలు రాష్ట్రాల్లో చదువు..

నాన్న జగదీశ్‌బాబు ఆదాయ పన్నుశాఖలో ఐఆర్‌ఎస్ హోదాలో అధికారిగా పని చేస్తున్నారు. అమ్మ సుధారాణి గృహిణి. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు ఆరో తరగతి వరకు ముంబయిలో, ఏడు, ఎనిమిది తరగతులు దిల్లీలో, తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు హైదరాబాద్‌లో సాగింది. అనంతరం ఐఐటీ కాన్పూర్‌లో 2020లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. నాన్న స్ఫూర్తితో సివిల్స్‌కు సన్నద్ధమై 2022లో తొలి ప్రయత్నంలోనే 70వ ర్యాంకుతో ఐఏఎస్ ఎంపికయ్యాను. తెలంగాణ క్యాడర్‌కు కేటాయించటంతో.. రెండేళ్ల పాటు వికారాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా ప్రస్తుత జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వద్ద శిక్షణ పొందాను. శిక్షణ అనంతరం తొలిసారి మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాను.

అదే నా వ్యాపకం..

ఖాళీ సమయాల్లో క్రికెట్ ఆడటం, ఓటీటీలో సినిమాలు చూడటం నా అలవాటు. ప్రస్తుతం పెద్ద డివిజన్‌కు బాధ్యతలు చేపట్టడంతో క్రికెట్ ఆడే సమయం ఉండటం లేదు. వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించి.. వారి సంక్షేమానికి తక్షణమే చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్నా.. నేరుగా కార్యాలయంలో కలవొచ్చు. మిర్యాలగూడ వంటి ప్రాంతంలో పని చేయడం ఎంతో సంతోషం.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం..

రానున్న కొన్నేళ్లలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంచడమే ధ్యేయంగా ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యాను. ప్రస్తుతం సబ్ కలెక్టర్‌గా ధరణి, భూ సమస్యలు వంటివి పరిష్కరిస్తూనే విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాను. బాధ్యతలు చేపట్టిన తర్వాత వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు ఓటరు జాబితా సవరణ ముమ్మరంగా చేపడుతున్నాం. అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించనున్నాం. ఇటువంటి ఉద్యోగాల్లో పేదలు, దివ్యాంగులను కలిసి వారి సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రణాళికాబద్ధంగా పది గంటలు చాలు..

కరోనా సమయంలో సివిల్స్ సన్నద్ధమైనందున స్వతహాగా ఆన్‌లైన్‌లో చదువుకున్నాను. రోజుకు కేవలం పది గంటలు పాటు మాత్రమే చదివాను. సివిల్స్ ఇతర ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారు ప్రణాళికబద్ధంగా రోజుకు 10 గంటలు పాటు చదివితే చాలు. ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు టెలిగ్రామ్ వంటి యాప్‌లలో అనేక మంది నిపుణుల నోట్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని సమగ్రంగా చదివితే ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదు.

ఆ ఊరంతా లారీలే..

వంద మందికి పైగా డ్రైవర్లే..!



సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఆ ఊళ్లో ఎవరినైనా కదిలిస్తే.. మా నాన్న డ్రైవరు, మాకు లారీలు ఉన్నాయి. మా అన్న డ్రైవరే.. మా తమ్ముడు డ్రైవరే, వాళ్లకు లారీలు ఉన్నాయని చెబుతుంటారు. ఎందుకంటే ఆ గ్రామంలో వందకుపైగా లారీ పరిశ్రమనే నమ్ముకొని జీవిస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. 130 కుటుంబాలు ఉన్న ఈ ఊరిలో ప్రతి ఇంటిలో వ్యక్తి లారీ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇలా గ్రామంలో లారీ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లుగా పనిచేస్తున్నారు. ఊర్లో సుమారు 150కు పైగా లారీలు ఉండేవి. 45 ఏళ్లుగా ఈ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కొన్ని కుటుంబాల్లో ఒక్కరికి నాలుగు వరకు లారీలు ఉండటం విశేషం. మొదట క్లీనర్‌గా పనిచేసిన వారు డ్రైవర్లుగా మారారు. తర్వాత లారీ ఓనర్ కమ్ డ్రైవర్‌గా.. రాను రాను లారీలకు యజమానులుగా మారి ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు లారీలతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. కొంత మంది డ్రైవింగ్ ఫీల్డ్‌కు సంబంధం లేకున్నా లారీ యజమానులుగా మారి డ్రైవర్లతో లారీ పరిశ్రమను నమ్ముకొని ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ ప్రస్తుతమున్న యువత చాలా వరకు లారీ డ్రైవర్లుగానే ఉపాధి పొందుతున్నారు. కరోనా విపత్తుల తర్వాత డ్రైవర్ వృత్తి ఇబ్బందికరంగా మారడంతో పాటు వ్యాపారం అంత లాభాసాటిగా లేకపోవడంతో గ్రామంలో లారీ వృత్తి మసకబారుతోంది. నాలుగు లారీలు ఉన్నవారు ఒకటి రెండుకు వచ్చారు. ఒక్క లారీ ఉన్న వారు డ్రైవర్లుగా మారారు. ప్రస్తుతం ఇప్పుడు సుమారు వంద లారీల వరకు ఉన్నాయి.

మొదట ఆ ఇద్దరే ..



నలభై ఏళ్ల క్రితం మొదటసారి అంతటి భిక్షపతి కొనుగోలు చేసిన లారీ (దాచిన చిత్రం)

మొదట ఈ గ్రామంలో అంతటి భిక్షపతి, యాదయ్యలు 1980లో డ్రైవర్లుగా ఉన్నారు. వీరి వద్ద క్లీనర్‌గా వెళ్లి డ్రైవర్లుగా మారుతూ. . ఒకరి నుంచి ఒకరు ఊరంతా లారీ డ్రైవర్లు, ఓనర్లుగా మారారు. మొదట గ్రామంలో లారీ యజమానిగా మారింది కూడా అంతటి భిక్షపతే.. ఐతే ఈ ఊర్లో డ్రైవర్లుగా పని చేసి వయసు మీద పడిన వారు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆ ఇంట్లో లారీ పరిశ్రమను మాత్రం వదలేదు. దసరా పండుగ రోజు ఈ లారీలన్నీ స్వగ్రామం చేరుకుంటాయి. లారీల రాకతో ఈ గ్రామం సందడిగా మారుతుంది. తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీల యాజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సుర్వి యాదయ్య, ఆటో నగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న సుర్వి రాజుగౌడ్ అల్లందేవి చెర్వు గ్రామస్థులే కావడం విశేషం.

సిమెంట్స్ కర్మాగారంపై పీసీబీ చర్యలు?

దామరచర్ల, న్యూస్‌టుడే: కాలుష్య నియంత్రణలో విఫలమైన ఓ సిమెంట్ కర్మాగారంపై పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని సిమెంట్ పరిశ్రమను గురువారం తనిఖీ చేసిన పీసీబీ అధికారులు.. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఫ్యాక్టరీని రన్ చేయవద్దని లిఖిత పూర్వకంగా ఆదేశించినట్లు సమాచారం. నెల రోజులుగా పరిశ్రమ నుంచి విపరీతంగా దుమ్ము, పొగ విడుదల కావడంతో పరిసర గ్రామాల ప్రజలు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పీసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరుపగా ప్లాంటులో డస్ట్ క్లీనర్లు అమర్చకపోవడంతో అధిక మోతాదులో పొగ గొట్టాల ద్వారా దుమ్ము వెలువడుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై పీసీబీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. తహసీల్దార్ జవహర్‌లాల్‌ను అడుగగా తమకు సమాచారం లేదన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణిత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించారు.

డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలిక పరిధి తొమ్మిదో వార్డులో మొదలైన కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ గురువారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. సర్వేను గడువులోగా పూర్తిచేయాలని, ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, పుర కమిషనర్ డి.బాలయ్య పాల్గొన్నారు.



నకిరేకల్: అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

భూదాన్ పోచంపల్లి, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతితో వివాహం అవుతుందో లేదోనని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచంపల్లి పట్టణం గాంధీనగర్‌కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చిలుక శ్రీనివాస్(22) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బంధువైన యువతిని ప్రేమిస్తున్నాడు. వివాహానికి కుటుంబ సభ్యులు ఒప్పుకుంటారో లేదోనని ఆందోళనకు గురయ్యాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు బతుకమ్మ ఆడటానికి బయటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి విగతజీవిగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. గురువారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



మల్లారెడ్డి

చండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కస్తాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెండు మల్లారెడ్డి(42) తన వ్యవసాయ పొలం సమీపంలోని విద్యుత్తు నియంత్రికకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.వెంకన్న తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన బుచ్చయ్య

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణ శివారులోని గ్రీన్ దాబాలో పని చేసే ఓ యువకుడు బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన అంకూరి బుచ్చయ్య (30) నాలుగేళ్లుగా పట్టణ శివారులోని గ్రీన్ దాబాలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రీన్ దాబా రెస్టారెంట్ బంద్ కావడంతో దేవరకొండ పట్టణానికి వెళ్లి తిరిగి రాత్రయ్యాక దాబాకు వచ్చారు. గురువారం తెల్లవారుజామున దాబాలో పని చేసే బుచ్చయ్య మరుగుదొడ్డి సమీపంలో విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ విషయాన్ని దాబా నిర్వాహకులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ నిర్వహించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ముఖంపై రక్తస్రావం, చేయి నల్లబడటంతో మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించడంతో అవి పని చేయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మృతదేహాన్ని గురువారం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

రజితది హత్యే..!



జాల రజిత

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం ములకపల్లిలో గత నెలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జాల రజిత(32)ది హత్యేనని పోలీసులు గురువారం తేల్చారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు గురువారం గుర్రంపోడుకు వచ్చి ములకలపల్లిలో విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో నిందితులుగా భావిస్తున్న జాల రాములును ఇది వరకే రిమాండ్ పంపగా, రెండు రోజుల క్రితం బెయిల్‌పై వచ్చారు. గురువారం డీఎస్పీ రాజశేఖర్ రాజు విచారణ అనంతరం ప్రధాన నిందితుడు రాములు భార్య జాల పార్వతమ్మ, ఆయన అన్న కుమారుడు జాల వెంకటయ్యను అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో వీరు ముగ్గురు హత్యలో పాల్గొన్నట్టు తేలిందని ఆయన వెల్లడించారు. సెప్టెంబరు 29న ములకలపల్లిలో జాల రజిత ఉరి వేసుకుని మృతి చెందిన కేసును తొలుత ఆత్మహత్యగా నమోదు చేయడంతో ఈ కేసులో స్థానిక పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఏఎస్పీ రాములు నాయక్ నేతృత్వంతో ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. త్వరలో పూర్తి వివరాలు పోలీస్ యంత్రాంగం వెల్లడించనుంది.

సాహితీ ప్రవంతి



కథానాయకుడు రాజ్‌తరుణ్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న మేఘప్రవంతి (పాత చిత్రం)



చిత్రగీతాన్ని ఆలపిస్తున్న మేఘప్రవంతి

మఠంపల్లి, న్యూస్‌టుడే: సాహిత్యాన్ని శోధించి తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన 100 మంది దాసు కవులను నేటి తరానికి పరిచయం చేసిన ఓ యువ రచయిత్రి అందులో తన పరిశోధన పూర్తిచేసి ఓయూ నుంచి ఇటీవలే డాక్టరేట్ అందుకున్నారు. శతక రచనలతో పాటు మేఘప్రవంతి పేరుతో ఓ కవితా సంపుటినీ వెలువరించి దాన్ని సామాజిక కోణంలో తీర్చిదిద్దారు.. సొంతగా ప్రారంభించిన యూట్యూబ్ ఛానెల్ ద్వారా దేశభక్తి, జానపద గీతాలను స్వయంగా రాసి వాటికి స్వరకల్పన చేయడంతో పాటు స్వీయ గానంతో వీక్షకుల ఆదరణ పొందుతున్నారు. చిత్ర రంగంలోనూ నేపథ్య గాయనిగా వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని తనదైన బాణిలో రాణిస్తున్నారు.


పరిశోధనలో ప్రత్యేకత..

మఠంపల్లికి చెందిన ఉండేటి మేఘప్రవంతి సాహిత్యంపై మక్కువతో ఎంఏ తెలుగు, అనంతర కాలంలో ఎంసీఏ పూర్తిచేసి ప్రస్తుతం జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ చేయాలన్న తన చిరకాల స్వప్నం నెరవేర్చుకునేందుకు 2017లో ఓయూలో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షకు హాజరై ఐదో స్థానంలో నిలిచారు. పరిశోధనాంశంగా తెలంగాణ దాసు సాహిత్యాన్ని ఎంచుకుని భక్తాగ్రేసరులుగా ప్రఖ్యాతి గాంచిన రామదాసు, వేపూరు హనుమద్దాసు, మన్నెకొండ హనుమద్దాసు, ఈగ బుచ్చిదాసు, దున్న ఇద్దాసు తదితర 100 మంది వాగ్గేయకారుల సాహిత్యాన్ని స్పృశిస్తూ పరిశోధన కొనసాగించారు. 'అనాది అనాథ శతకం' పేరుతో 2021లో అనాదిగా అణచివేతకు గురవుతున్న దీనుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని పద్య రచన చేశారు.

నేపథ్య గాయనిగా..

మేఘప్రవంతి అంధగాడు, హంతకుడు, రాణిగారి బంగ్లా, పోలీస్ పవర్, అదీ లెక్క, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వంటి పలు చిత్రాల్లో పాటలు పాడారు. ఈటీవీ పాడుతా-తీయగా, దూరదర్శన్ యాదగిరి పాడనా తెలుగు పాట వంటి షోలలో పాల్గొన్నారు. జానపద, దేశభక్తి గీతాలను మధుర గళంతో ఆలపించి ఆల్బమ్‌లు విడుదల చేశారు. భర్త వినయ్‌కుమార్, తల్లిదండ్రులు మరియమ్మ, ప్రభుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి రాగలిగానని మేఘప్రవంతి చెప్పారు.

వ్యవసాయ శాఖలో వసూల్ రాజాలు



ఈనాడు, నల్గొండ : 'గతంలో ఏం ఇచ్చారో ఇప్పుడు అనవసరం. నాకు మాత్రం దుకాణానికి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సిందే. లేదంటే మీ దుకాణాలు సక్రమంగా నడపలేరు. అనవసరంగా ఇబ్బందుల పాలు కావొద్దు'.. నల్గొండ జిల్లాలోని ఓ డివిజనల్ వ్యవసాయ అధికారి, ఇటీవల ఆయన్ను కలిసిన ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులకు చేసిన హుకూం ఇది. నల్గొండ జిల్లా వ్యవసాయ శాఖలో ఓ అధికారి వసూల్ రాజాగా మారారు. నెలన్నర క్రితం ఉమ్మడి జిల్లాలోని ఇతర జిల్లా నుంచి బదిలీ అయి వచ్చిన ఆయన.. వచ్చీ రాగానే వసూళ్లకు తెరలేపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల నుంచి టార్గెట్లు పెట్టి మరీ అక్రమాలకు పాల్పడుతున్నారని సంబంధిత శాఖలో ప్రస్తుతం చర్చ సాగుతోంది. ఎరువులు, విత్తనాల దుకాణాలు ఎక్కువగా ఉండే మిర్యాలగూడ డివిజన్‌లో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. సదరు డివిజన్‌లో సుమారు 100 వరకు దుకాణాలుండగా.. ఒక్కో దుకాణం నుంచి రూ.10 వేలు, మొత్తంగా రూ.10 లక్షలను వసూలు చేయాలని శాఖలోని కొందరు కింది స్థాయి ఉద్యోగుల ద్వారా దుకాణాల యజమానులపై బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో నేడో, రేపో వారంతా జిల్లా కలెక్టరును కలిసి తమ గోడును వెళ్లబోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు శాఖలోని కొంత మంది మండల స్థాయి అధికారులు సైతం దుకాణాదారులను డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది.

'నిబంధనలు పాటించని దుకాణాదారులపై ఎలాంటి చర్యలు అయినా తీసుకోనివ్వండి. రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు అందిస్తూ న్యాయంగా వ్యాపారం చేస్తున్న మాపైనా సంబంధిత అధికారులు నిత్యం డబ్బులివ్వాలని వేధిస్తున్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి వసూల్ రాజాలపై చర్యలు తీసుకోవాల'ని మిర్యాలగూడలోని ఓ దుకాణాదారుడు 'ఈనాడు'కు వెల్లడించారు.

నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్‌గా రజిత



నకిరేకల్: పుర ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన చౌగోని రజితకు ధ్రువపత్రం అందజేస్తున్న నల్గొండ ఆర్డీవో శ్రీదేవి, కమిషనర్ బాలయ్య



నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన రజితను సన్మానిస్తున్న వైస్ ఛైర్‌పర్సన్ ఉమారాణి, కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా చౌగోని రజిత (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత భారాస ఛైర్మన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీ అయిన స్థానానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో నల్గొండ ఆర్డీవో, ప్రత్యేక అధికారిణి శ్రీదేవి గురువారం ఎన్నిక నిర్వహించారు. పురపాలికలో మొత్తం 20 మంది వార్డు కౌన్సిలర్లకు గాను 17 మంది హాజరయ్యారు. ఛైర్‌పర్సన్ స్థానానికి 9వ వార్డు కౌన్సిలర్ చౌగోని రజిత పేరును ఒకటో వార్డు కౌన్సిలర్ కందాళ భిక్షంరెడ్డి ప్రతిపాదించగా 16వ వార్డు కౌన్సిలర్ గర్శకోటి సైదులు బలపర్చారని, ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఆర్డీవో శ్రీదేవి ప్రకటించారు. రజితతో నూతన ఛైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. కమిషనర్ డి.బాలయ్య పాల్గొన్నారు. పుర వైస్ ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు గాజుల సుకన్య, దైద స్వప్న, యాసారపు లక్ష్మి, పన్నాల పావని, వంటెపాక సోమలక్ష్మి, చౌగోని అఖిల, మట్టిపల్లి కవిత, చౌగోని రాములమ్మ, పోతుల సునీత, స్వాతి, గడ్డం స్వామి, బానోతు వెంకన్న, రాచకొండ సునీల్ ఈ ప్రత్యేక సమావేశానికి హాజరై రజితకు మద్దతిచ్చి అభినందించారు. మేజర్ పంచాయతీగా ఉన్న నకిరేకల్ 2020 డిసెంబరు 16న పురపాలికగా ఆవిర్భవించింది. 2021 మేలో తొలి పాలకవర్గం ఎన్నికైంది. ఐదేళ్ల కాలపరిమితి ముగియక ముందే అవిశ్వాసం ద్వారా ఛైర్మన్ స్థానం ఖాళీ కావడంతో చౌగోని రజిత పురపాలిక రెండో ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక అయ్యారు.

★ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేస్తానని నూతన ఛైర్‌పర్సన్ చౌగోని రజిత చెప్పారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు: డీఎల్‌పీవో


వలిగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్, తదితరులు

వలిగొండ, న్యూస్‌టుడే: మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మంచినీటి సహాయకుల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా కడిగి ప్రజలకు నాణ్యమైన మంచి నీటిని అందించాలని సూచించారు. పల్లెల్లో పైపులైన్, గేట్‌వాల్వు లీకేజీల మరమ్మతులపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రశాంత్‌కుమార్, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఎంపీవో కేదారేశ్వర్, ఏఈలు మహేశ్, శ్రీలత పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్‌గా మార్చండి: సీపీఎం


వలిగొండ: గోకారం సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

వలిగొండ, న్యూస్‌టుడే: గోకారం రామసముద్రం చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ డిమాండ్ చేశారు. గోకారం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామసముద్రం చెరువు లోతు తగ్గడంతో నీటి సామర్థ్యం తగ్గి దిగువ గ్రామాల రైతులకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువును తవ్వి ధర్మారెడ్డిపల్లి కాల్వకు ఉన్న కల్వర్టులు, తూములకు మరమ్మతులు చేపడితే నార్కట్‌పల్లి మండలంలోని గ్రామాలకు సాగు నీరు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజుగౌడ్, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, తుర్కపల్లి సురేందర్, కవిడే సురేశ్, పబ్బు నారాయణ, రామస్వామి పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఉపాధి


పాలకూర సాగు

ఆలేరు, న్యూస్‌టుడే:

ఆలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా రైతులు ఆకుకూరలు, కూరగాయల తోటలు సాగుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. బోరు నీటితో పది గుంటలు, అర ఎకరం, ఎకరం విస్తీర్ణంలో వీటిని పండిస్తున్నారు. తోటకూర, పాలకూర, బచ్చలికూర, గోంగూర, పుదీనా, కొత్తిమీర సాగు చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సాగులో నిమగ్నమవుతారు. రోజు విడిచి రోజు తెల్లవారు జామున వెళ్లి ఆకు కూరలను కోసి కట్టలు కడతారు. సంతలకు తరలించి విక్రయిస్తారు.

పదేళ్లుగా..



– ఎ.మహేశ్వరి, బొమ్మలరామారం

పదేళ్లుగా ఆకుకూరల రకాల సాగును చేపడుతున్నాం. బిందు సేద్యం పద్ధతిన నీటిని అందిస్తున్నాం. మంచి దిగుబడితో ఆదాయం వస్తోంది. స్థానికంగా విక్రయించడంతో పాటు సమీపంలోని కుషాయిగూడలోని మార్కెట్‌కు, చిరు వ్యాపారులకు సరఫరా చేస్తున్నాం. చాలా వరకు సేంద్రియ ఎరువులు వాడుతుండటంతో చాలామంది ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులు వాడుతాం



– ఎ.లావణ్య, బొమ్మలరామారం

ఆకుకూరలు, కూరగాయల పంటలు సాగుచేస్తున్నాం. సేంద్రియ ఎరువులు వాడుతుండటతో చాలా మంది ఇష్టపడి కొంటున్నారు. స్థానికంగా విక్రయించడంతో పాటు సమీప పట్టణ ప్రాంతానికి వెళ్లి విక్రయిస్తాం. పెట్టుబడులు, రవాణా ఖర్చులు పోను వచ్చే ఆదాయంతో ఇంటి ఖర్చులు, పిల్లల చదువులకు సరిపోతున్నాయి.

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

? భువనగిరి పురపాలిక పరిధిలోని 12వ వార్డు పగిడిపల్లిలో శ్మశానవాటిక పక్కన మురుగుకాల్వ లేకపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– రామకృష్ణ, కాలనీవాసి

✔ పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – రామాంజులరెడ్డి, కమిషనర్, పురపాలిక.

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం ఎస్సీకాలనీలో ప్రధాన వీధిలో రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.
– నాగారం మహేష్, బొమ్మలరామారం.

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తాం.
– పద్మజ, పంచాయతీ కార్యదర్శి.

రహదారి బాగుపడేదెన్నడో



తుర్కపల్లి మండలం నాగాయిపల్లితండా నుంచి గోపాల్‌పురం వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. బీటీ రోడ్డు మట్టి రోడ్డుగా మారి గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న రెండు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డుని బాగు చేయాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నిధులు మంజూరు కాగానే రహదారిని అభివృద్ధి చేస్తామని పీఆర్ ఏఈ చక్రధర్ తెలిపారు.
– తుర్కపల్లి, న్యూస్‌టుడే:

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో శోభారాణి, డీసీపీ రాజేశ్‌చంద్ర అన్నారు. అనాజిపురంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షతో పాటు పలు విలువైన పరీక్షలు నిర్వహించిన క్లబ్ నిర్వాహకులను అభినందించారు. రోటరీ అధ్యక్షుడు కరిపె నర్సింగరావు మాట్లాడుతూ.. శిబిరంలో 209 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ బండారు శ్రీనివాస్‌రావు, సత్యనారాయణరెడ్డి, దేవేంద్రాచారి, శెట్టి బాలయ్యయాదవ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చండి: గూడూరు

భువనగిరి, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని భాజపా రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పు కోసం గురువారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బాధిత రైతులు చేపట్టిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు.



ధర్నాలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కాళేశ్వరం కాల్వలు పరిశీలించిన ఎమ్మెల్యే


గేట్‌వాల్వ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చే కాళేశ్వరం కాల్వలను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం పరిశీలించారు. సిద్దిపేట జిల్లా పీర్లపల్లి వద్ద ఉన్న గేట్‌వాల్వ్, గంధమల్ల చెరువుకు సరఫరా చేసే కాల్వను చూశారు. నీటి ప్రవాహం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిన బీమరిగూడెం ప్రజల సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం తుర్కపల్లి మండలం సంగ్యతండా నుంచి బస్వాపురం రిజర్వాయర్, యాదగిరిగుట్ట మండలాలకు వెళ్లే కాల్వలు సందర్శించారు. అసంపూర్తి పనులు పూర్తి చేస్తామని రైతుల కష్టాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వెంకటాపురం తోక చెరువులోకి నీటిని విడుదల చేయించి అక్కడి నుంచి యాదగిరిగుట్ట మండలంలోని చెరువులన్నీ నింపి సాగునీటి సమస్యలు తీర్చనున్నట్లు పేర్కొన్నారు. ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఐనాల చైతన్య రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయక్, వెంకటేశం, మహేందర్‌రెడ్డి, రాజారామ్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జల్లెల పెంటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ కాలుష్యంతో ప్రజారోగ్యం దెబ్బతింటున్న తరుణంలో కొమ్మాయిగూడెంలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం చేయాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగిరెడ్డి మల్లారెడ్డి, మల్లేశం, దుర్గయ్య, నర్సింహ, అశోక్‌రెడ్డి ఫజల్ పాల్గొన్నారు.


రామన్నపేట సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్, తదితరులు

కాల్వ పనులు ప్రారంభించాలని డిమాండ్

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: అసంపూర్తిగా నిలిచిపోయిన బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ.400 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆత్మకూరు(ఎం), మోత్కూరు, మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు మండలాల ఆ పార్టీ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాల్వ పనులు పూర్తి చేయకపోతే ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మారుపాక వెంకటేశం, బోలగాని సత్యనారాయణ, ఉప్పల ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాలపై దాడులు

భువనగిరి గంజ్: భువనగిరి పట్టణంలోని మద్యం గొలుసు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు మూసి ఉండటంతో గొలుసు దుకాణాలు, ఇతర వ్యక్తులు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో తాతానగర్, హుస్నాబాద్, పహాడీనగర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఏడు కేసులు నమోదు చేసి సుమారు రూ.40 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బతుకమ్మ సందడి


భువనగిరి: బతుకమ్మలతో విద్యార్థినులు


రామన్నపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మలను తీసుకెళ్తున్న ఉపాధ్యాయునులు, విద్యార్థినులు

భువనగిరి గ్రామీణం : వాత్సల్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్, పాలిటెక్నికల్ విద్యార్థినులు బతుకమ్మ ఆటతో సందడి చేశారు. కళాశాల ఛైర్మన్ దరిపల్లి నవీన్‌కుమార్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ దుర్గాప్రసాద్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండాల: బతుకమ్మ వేడుకలను మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులతో కలిసి తహసీల్దార్ జలకుమారి, ఎంపీడీవో ఎ.దేవిక బతుకమ్మ ఆడారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా జరిపారు.

భువనగిరి పట్టణం: భువనగిరి పట్టణంలోని పలు కళాశాలల్లో గురువారం బతుకమ్మ వేడుక నిర్వహించారు. జాగృతి డిగ్రీ కళాశాలు, చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ బొజ్జా సూర్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ దర్పల్లి ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్: బీబీనగర్ మాజీ సర్పంచి మల్లగారి భాగ్యలక్ష్మి తన నివాసంలో అటుకుల బతుకమ్మ గురువారం నిర్వహించారు. బిగ్‌బాస్ ఫేమ్ సావిత్రి పాల్గొన్నారు. ఆంజనేయస్వామి ఆలయం దగ్గర మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.


బీబీనగర్ మాజీ సర్పంచి భాగ్యలక్ష్మీ నివాసంలో బతుకమ్మ పేరుస్తున్న బిగ్‌బాస్ ఫేమ్ సావిత్రి

డిజిటల్ హెల్త్ కార్డు సర్వే


బీబీనగర్ మండలంలో డిజిటల్ హెల్త్ కార్డు సర్వేపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

బీబీనగర్, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ హెల్త్ కార్డుల ఇంటింటి సర్వేను బీబీనగర్ మండలంలో గురువారం చేపట్టారు. పైలెట్ ప్రాజెక్టుగా బీబీనగర్ మండలంలోని మహదేవపురం గ్రామపంచాయతీని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే ఎంపిక చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేపడుతారు. కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారు. అనంతరం ఆ వివరాలను కలెక్టరేట్‌లో అందజేస్తారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలతో పాటు రేషన్, ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్‌కార్డును ఒకే కార్డుతో పనిచేసే విధంగా డిజిటల్ కార్డ్స్ రూపొందించనున్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం: ప్రజలకు బహుళ ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సర్వేకు ప్రజలు సహకరించాలని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని 15వ వార్డు అర్బన్‌కాలనీలో చేపడుతున్న సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పట్టణంలోని 15వ వార్డును సర్వేకు ఎంపిక చేసిందన్నారు. వార్డులో 415 ఇళ్లు ఉన్నాయని అన్నారు. వార్డులోని కుటుంబాల వివరాలను మూడు బృందాలు సేకరిస్తున్నాయన్నారు. ప్రజలు సర్వే బృందానికి ఆధార్‌కార్డు, ఫొటోలను ఇవ్వాలని, ఇళ్లలో అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజులరెడ్డి, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

అలంకార సేవలు.. భక్తుల మొక్కులు


ఆలేరు: కొలనుపాకలో దుర్గా అమ్మవారికి మహిళల పూజలు

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ ఆలయ ప్రధాన పూజారి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. అమెరికాకు చెందిన మేళ్లచెరువు ఉష, రాజేష్‌కుమార్ కుటుంబ సభ్యులు మేలు జాతి ఆవు, దూడను సమర్పించారు.

☛ స్వర్ణగిరి క్షేత్రంలో భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు తులాభారం సేవ ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించి పటిక బెల్లంతో తులాభారం తూగారు. మొక్కులు చెల్లించుకునేట్లు ఏర్పాట్లు చేసినట్లు ధర్మకర్త మురళీకృష్ణ తెలిపారు.

వలిగొండ : వలిగొండలోని త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు గురువారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ముగ్గురు అమ్మవార్లు లలితా త్రిపుర సుందరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

భూదాన్‌పోచంపల్లి : పురపాలిక కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన కనుల పండువగా జరిగింది. శ్రీ దుర్గాకమిటీ, శ్రీమద్దెలమ్మ దేవి ఆలయం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిపారు.

చౌటుప్పల్ : చౌటుప్పల్ భవానీనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీదుర్గాదేవి బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీమార్కండేయ దేవాలయంలో శ్రీబాలత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

చౌటుప్పల్‌గ్రామీణం : కొయ్యలగూడెం, ఎల్లంబావి, దండుమల్కాపురం, పంతంగి, నేలపట్ల, జైకేసారం, ఎస్.లింగోటం తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు.

బొమ్మలరామారం : బొమ్మలరామారం, మర్యాల, తిమ్మాపూర్, నాగినేనిపల్లి గ్రామాల్లో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిదేవి అవతారంలో అలకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలేరు : ఆలేరు మండలంలో దుర్గా నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలేరు, కొలనుపాకలో 500 మంది యువకులు, మహిళలు, చిన్నారులు దీక్షలు తీసుకున్నారు. మండపాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.


భువనగిరి ఆజాద్ రోడ్డులో మహిళల పూజలు

యాదగిరిగుట్ట పట్టణం : గుండ్లపల్లిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భువనగిరి: భువనగిరి ఆజాద్‌రోడ్డులోని శ్రీరామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కనకదుర్గమ్మ అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరి దేవీగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


చౌటుప్పల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, భక్తులు

యాదాద్రీశుడి సేవలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో గురువారం సందర్శించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దైవారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ఆలయ సంప్రదాయంగా పండితులు ఆశీర్వదించారు.

పంచలోహ శ్రీచక్రాల ప్రతిష్ఠాపనోత్సవం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపల్లిలోని శివశక్తి శిరిడిసాయి అనుగ్రహ మహాపీఠం (రమణేశ్వరం)లో దేవినవరాత్రి ఉత్సవాలు, 1008 పంచలోహ శ్రీచక్రాల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం రమణానందమహర్షి ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రమణేశ్వరంలో పూజలు నిర్వహిస్తున్న రమణానందమహర్షి

అవీ ఇవీ

ఏకగ్రీవ ఎన్నిక.. గుండాల: పెద్దపడిశాల సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా మల్లెబోయిన బాలయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు తెలిపారు. గురువారం గ్రామంలో నిర్వహించిన మహాసభ సందర్భంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఫ్రీజరు అందజేత.. ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్లకు చెందిన ఇరుకుల్ల రామలింగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఇరుకుల్లా వెంకన్న గుప్తా, రాంబాబు గుప్తాలు బాడీ ఫ్రీజరును గురువారం గ్రామపంచాయతీకి ఉచితంగా అందించారు. పంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి విగ్నేష్, నాయకులు భాషబోయిన పాపయ్య, సత్యనారాయణ, స్వామి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం.. మోటకొండూరు: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో నేల ఆరోగ్యం జీవన ఎరువుల వాడకంపై రైతులకు మండల కేంద్రంలో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించి మాట్లాడారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లోని వనరులను వివరిస్తూ, అధిక దిగుబడికి పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వయసాయ శాస్త్రవేత్త కె.మమత, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ బి.అనిల్‌కుమార్, వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి.. తుర్కపల్లి: సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్రీయ సంగోలి రాయన్న సేనా రాష్ట్ర అధ్యక్షుడు సోమల్ల మహేందర్‌కురుమ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ.. అడ్డగూడూరు: మండలంలోని చౌళ్లరామారం పెద్ద చెరువు, చౌటకుంటల్లో గురువారం గ్రామ మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. రవ్వ, బొచ్చ, బంగారుతీగ, కొర్రమీను తదితర 40వేల చేప పిల్లల రకాలను వదిలినట్లు మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు పంగ యాదగిరి తెలిపారు. మత్స్యకార్మికులు పంగ వెంకన్న, లింగయ్య, అంజయ్య, భాను పాల్గొన్నారు.

బొడిగె లక్ష్మయ్య సంతాప సభ.. రామన్నపేట, న్యూస్‌టుడే: ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, కేంద్ర మాజీ కమిటీ సభ్యుడు బొడిగె లక్ష్మయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. మండలంలోని శోభనాద్రిపురంలో గురువారం బొడిగె లక్ష్మయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. చంద్రారెడ్డి, సుధాకర్, ఎండీ జహంగీర్, వెంకట్‌రెడ్డి, మజీద్, రవీందర్ పాల్గొన్నారు.

కురుమ సంఘం కమిటీ.. ఆలేరు: టంగుటూరు కురుమ సంఘం కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా పెద్ద కురుమలు ఇక్కిరి ఉప్పలయ్య, జూకంటి బీరయ్య నియమితులయ్యారు. అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జన్నె మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ఎం.సిద్దేశ్వర్, కోశాధికారి జూకంటి సత్తయ్య సహాయ కార్యదర్శి ఇక్కిరి శ్రీహరి ఎన్నికయ్యారు.

ఆలేరు శివార్లలో కొండ చిలువ.. ఆలేరు: ఆలేరు-జీడికల్ రహదారిలో సాయిగూడెం అండర్‌పాస్ వద్ద గురువారం సాయంత్రం కొండ చిలువను బాటసారులు గుర్తించారు. విషయం తెలిసిన కొందరు కొట్టి చంపారు. ఆలేరు ప్రాంతంలో కొండ చిలువ ఆనవాళ్లు కన్పించడం గత దశాబ్ద కాలంలో ఇదే ప్రథమం.

నేల రాలిన ఆశలు


సంగెంలో నేల కొరిగిన పంటను చూపుతున్న రైతులు

వలిగొండ, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు రైతులను కోలుకోలేని దెబ్బతిస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షం, ఈదురుగాలులతో చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. వలిగొండ మండలం సంగెం, వర్కట్‌పల్లి, గోకారం తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. మరో పది రోజుల్లో కోత దశకు వరి పంట చేరుకోవడంతో వడ్లు రాలుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోత్కూరు, న్యూస్‌టుడే: మండలంలోని అనాజిపురంలో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, ముసురు వర్షానికి 30 ఏళ్లుగా పెంచుతున్న 40 మామిడి చెట్లు నేలకూలాయి. పొట్టకు వచ్చిన, కోతకు వచ్చిన వరి చేలు నేలవాలింది. మామిడి రైతులు కొల్లు లచ్చయ్య, కొల్లు శంకర్, వరికుప్పల రామచంద్రు, భీంరెడ్డి రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులకు చెందిన తోటల్లో చెట్లు కూలడంతో సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు. వరికుప్పల మల్లేష్, మేరుగు చిన్నమల్లారెడ్డి, యాదయ్య, కుమ్మరికుంట్ల శేఖర్‌రెడ్డి తదితరుల వరిచేలు నేలవాలి నష్టపోయారు. శేఖర్‌రెడ్డికి చెందిన చెలకలో ఉన్న పెద్ద పెద్ద వేపచెట్లు కూలిపోయాయని తెలిపారు.


అనాజిపురంలో ఈదురుగాలులకు నేలకూలిన 30 ఏళ్ల మామిడి చెట్టు

జిల్లా పౌరసంబంధాల అధికారిగా అరుంధతి

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లా పౌరసంబంధాల అధికారిగా యు.అరుంధతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అరుంధతి ప్రస్తుతం జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అడిషనల్ పౌరసంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అదనపు పౌరసంబంధాల అధికారిగా విధులు నిర్వహించారు.


కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను కలిసిన జిల్లా పౌరసంబంధాల అధికారి యు.అరుంధతి